నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

నేటి నుంచి జిల్లాలో పశుగణన

భువనగిరి అర్బన్, అక్టోబర్ 24 : జిల్లాలో నేటి నుంచి పశుగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వి.కృష్ణ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని, జిల్లాలోని 6 మున్సిపాలిటీలు, 17 మండలాలు, 421 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో నిర్వహిస్తామని వివరించారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కుక్కలు, బాతులు, గాడిదలు, గుర్రాలు మొదలైన వాటి వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. గత పశుగణనలో జిల్లాలో తెల్లజాతి పశువులు 69,173, గేదెలు1,22,621, గొర్రెలు 4,47,331, కోళ్లు 45,08,382లను గుర్తించినట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖకు చెందిన 34 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో శిక్షణ పొందిన 130 మంది ఎన్యూమరేటర్లు నాలుగు నెలల పాటు ఇంటింటికీ తిరిగి పశువుల వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. పశువుల సంఖ్యతో పాటు పాడి వివరాలు, పశుపోషకుల సామాజిక, ఆర్థిక వివరాలు కూడా సేకరించి భారత పశుగణన యాప్‌లో పొందుపర్చనున్నట్లు తెలిపారు. దీనిపై పోస్టర్లు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తామని, గ్రామాల వారీగా పశు గణన చేసే తేదీలను తెలియజేస్తామని సూచించారు. పశు పోషకులు సహకరించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఆర్‌జీవీ ఘరానా మోసం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో బాధితులు
- రూ.కోట్లల్లో నష్టపోయిన సూర్యాపేట వాసులు

కొద్దిరోజుల్లోనే కోటీశ్వరులు అంటే నమ్మి మోసపోయిన బాధితులు

'నిరుద్యోగులకు ఉద్యోగావకాశం.. కేవలం 1,800 రూపాయలు చెల్లించి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. అందులో వచ్చే యాడ్స్‌ను ప్రతి రోజూ చూస్తే చాలు. మీ అకౌంట్లో రోజూ డబ్బులు వేస్తాం. వాటిని వారానికొకసారి విత్‌డ్రా చేసుకోవచ్చు. గిఫ్ట్ అమౌంట్, బోనస్ అమౌంట్‌తో పాటు నెలనెలా జీతం కూడా ఇస్తాం. మా మాట నమ్మండి. కొద్దిరోజుల్లోనే కోటీశ్వర్లు అవ్వచ్చు' అంటూ మాయ మాటలతో జనం ముందుకు వచ్చిన ఆర్‌జీవీ సంస్థ కోట్లాది రూపాయలు దండుకున్నది.

– సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24

ఫిర్యాదు చేసేందుకు సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్న ఆర్‌జీవీ బాధితులు

గత జూలై నెలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో అమెరికాకు చెందిన సంస్థగా చెబుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలంటూ ఓ వ్యక్తి ఆర్‌జీవీ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. అవగాహన సదస్సులు పెడుతూ వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి రూ.1,800 కట్టించుకోవడమే గాక వారు మరికొంత మందితో డబ్బులు కట్టించేలా జిల్లా కేంద్రానికి చెందిన కొందరిని మధ్యవర్తులుగా పెట్టుకున్నాడు. తమ సంస్థలో రూ.1,800 కట్టి సభ్యత్వం తీసుకున్న వారికి యాప్ ఇచ్చారు. రోజూ 4 నుంచి 5 యాడ్స్‌ను పంపిస్తూ వాటిని చూసిన వారికి రోజూ 60 రూపాయలను యాప్‌లో జమ చేశారు. ఇలా 1,800 కడితే రోజుకు రూ.60, 4,500 కడితే 260, 15వేలు కడితే 540, 45వేలు కడితే 1,620, లక్షా 20వేలు కడితే 4,650 రూపాయలు అంటూ వసూలు చేశారు. చైన్ లింక్‌లో ఒక వ్యక్తి కింద 400 మంది సభ్యులు చేరితే వారికి లక్ష రూపాయల వేతనంతోపాటు సమావేశాలను ఏర్పాటుచేసుకునేందుకు అయ్యే ఖర్చులు ఇస్తూ వచ్చారు. ఇలా డబ్బులు వస్తుండడంతో అందులో చేరిన వారు తమకు తెలిసిన ప్రతి ఒక్కరినీ మోటివేట్ చేసి డబ్బులు కట్టించారు. వారు కూడా ఉన్నవి అమ్ముకుని మరీ లక్షల్లో పెట్టుబడి పెట్టారు. మరికొందరు తమ బంధువులు, తెలిసిన వారికి మీ డబ్బుకు మాది గ్యారంటీ అంటూ ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చి లక్షల్లో డబ్బు పెట్టించారు. యాప్‌లో వచ్చిన డబ్బులను సైతం మళ్లీ యాప్‌లోనే పెట్టుబడి పెట్టడంతో భారీగా మోసపోయారు. ఇలా జమ అయిన మొత్తాన్ని వారంలో ఒక రోజు బుధవారం విత్‌డ్రా పెట్టుకునే అవకాశాన్ని కల్పించగా నిన్న బుధవారం విత్‌డ్రా అప్షన్ కనిపించకలేదు. దాంతో యాప్‌లో డబ్బు పెట్టిన వారంతా భయాందోళనకు గురయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఆర్‌జీవీ బాధితులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించి తాము ఎంత నగదు పెట్టి, ఎలా మోసం పోయింది వివరిస్తున్నారు. దాంతో పోలీసులు సదరు మోటివేటర్స్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి ఎంక్వయిరీ చేస్తున్నట్లు తెలిసింది.

ఆరు లక్షలు మోసపోయాను

నేను మొదటి ఆర్‌జీవీ సంస్థను నమ్మలేదు. నా వద్దకు ఓ వ్యక్తి వచ్చి బాగా డబ్బులు వస్తాయని నమ్మించాడు. ఈ నెల 17న ముందు నేను మీ పేరున 15వేలు కడుతున్నాను.. తరువాత నాకు ఇద్దూలే అన్నాడు. యాప్‌లో డబ్బులు పడ్డాయి చూడు అని చూపెట్టి బుధవారం డ్రా చేసుకొవచ్చని చెప్పాడు. దాంతో నమ్మి నేను, నాకు తెలిసిన వారి నుంచి రూ.6లక్షల వరకు కట్టించాను. వారి డబ్బుకు నాది బాధ్యతని ప్రామిసరీ నోట్లు రాసిచ్చాను. పోలీసులు విచారణ చేసి మా డబ్బులు ఇప్పించాలి.

– కోనం యాదగిరి, ఇంద్రియాల గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా

2 లక్షల రూపాయలు కట్టాం

ఆర్‌జీవీలో చేరమని నాకు తెలిసిన వారు వెంట పడడంతో 45 వేల రూపాయలు కట్టాను. తరువాత నా కుటుంబ సభ్యులతో రూ.2లక్షల వరకు పెట్టించాను. పని చేసే వద్ద ఆఫీస్ స్టాఫ్‌నూ జాయిన్ చేయించాను. బుధవారం డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా విత్‌డ్రా ఆప్షన్ కనిపించ లేదు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే సంస్థ ఎత్తేసినట్లు తెలిసింది. ఆర్‌జీవీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

–ఆడోతు నాగరాజు, మిర్యాలగూడ

రామన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వొద్దు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, అక్టోబర్ 24 : రామన్నపేట మండల కేంద్రంలో అదానీ గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతులు ఇవ్వకుండా తన చిత్తశుద్ధిని చాటుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి సిమెంట్ పరిశ్రమను ఆపి ప్రజలకు మేలు చేస్తే పరిసర గ్రామాల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థులను పోటీలో నిలబెట్టబోమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ రోజున వెల్లువెత్తిన ప్రజాగ్రహం చూసైనా సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వదన్నారు. లేని పక్షంలో అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన భూముల్లో పేదలతో కలిసి వచ్చి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. రామన్నపేటకు రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తనను ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అరెస్టు చేసి నిర్బంధించి మునుగోడు, చండూరు, నాంపల్లి పోలీస్ స్టేషన్లకు తిప్పారని తెలిపారు. పోలీసులు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని ఎలా అనుమతించారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పేరుతో 100కోట్ల రూపాయలు తీసుకున్నది, మంత్రి పొంగులేటి, అదానీని కలిసింది వాస్తవం కదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తమ కేసులను తప్పిపుచ్చుకోవడానికే ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించే సిమెంట్ పరిశ్రమను ఈ ప్రాంతంలో పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత మార్చి నెలలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు నివేదికను తయారు చేశారంటూ అందుకు సంబంధించిన ప్రతులను బహిర్గతం చేశారు. మండల కేంద్రంలో అదానీ కొనుగోలు చేసిన భూముల పక్కనే ఉన్న 584 సర్వే నెంబర్‌లోని 114 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పందేండ్ల పాలనలో అదానీ కాలుష్య కంపెనీలను రాష్ట్రంలో అడుగు పెట్టనీయలేదన్నారు. అదానీ గ్రూప్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసుకునేంత వరకు ప్రత్యేక కార్యాచరణతో ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మర్రి జలేందర్‌రెడ్డి, మెట్టు మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, గొరిగే నర్సింహ, బాలగోని నర్సింహ, దోమల సతీశ్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు కన్నెబోయిన బలరాం, కూనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, గర్దాసు విక్రమ్, శివ, లక్ష్మణ్, లవణం రాము, బొడ్డు అల్లయ్య, మామిళ్ల కుమార్, బుర్ర శ్రీశైలం, ఎండీ అంజద్, జాడ అమరేందర్‌రెడ్డి, నల్ల సైదులు, బాసాని రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్ హనుమంతు కె. జెండగేకు వినతిపత్రం అందిస్తున్న పర్యావరణ పరిరక్షణ వేదిక సభ్యులు

ఎసెన్షియల్ కమిటీకి పంపే రిపోర్టును ప్రజల ముందుంచాలి

- కలెక్టర్‌కు రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక వినతి

రామన్నపేట, అక్టోబర్ 24 : రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పూర్తి స్థాయిలో వ్యతిరేకత తెలిపినందున ఎసెన్షియల్ కమిటీకి వాస్తవిక నివేదిక పంపి పరిశ్రమ రాకుండా చూడాలని రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ హనుమంతు కె జండగేకు కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. కమిటీకి అందించే నివేదిక బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రేయ సేకరణలో సుమారు 10 వేలమంది పాల్గొని సిమెంట్ పరిశ్రమ వద్దని వ్యతిరేకించారన్నారు. అన్ని గ్రామాల ప్రజలు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడాలని పనులు వదులుకొని మరీ వచ్చి తమ అభిప్రాయం తెలిపారని పేర్కొన్నారు. పూర్తి స్థాయి నివేదికను బహిరంగ పరిచి ప్రజల ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక సభ్యులు ఎండీ జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జెల్లెల పెంటయ్య, ఎండీ రేహాన్, పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నర్సింహ్మ, బొడ్డుపల్లి వెంకటేశం, గోదాసు పృథ్వీరాజ్, ఎండీ అక్రమ్, నకిరేకంటి నరేందర్, ఫజల్‌బేగ్, జమీరుద్దీన్, బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, నోముల రాజు పాల్గొన్నారు.

రైతులు బాధల్లో ఉంటే విదేశీ పర్యటనలా?

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 24 : రైతు బంధు రాక, రుణమాఫీ అందక, రైతు బీమా లేక, పండిన పంటను ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రులు విదేశీ పర్యటనలతో గడుపడం సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మండిపడ్డారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పే కాంగ్రెస్ సర్కారుకు రైతులు పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు కూడా సరిగ్గా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం మిల్లర్లు, ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కవడంతో క్వింటాకు రూ.2,300 కొనుగోలు చేయాల్సింది పోయి రూ.1,800 కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దాంతో ఒక్కో రైతు కింటాల్‌కు 500 రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో రైతులకు రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ వచ్చిందని, రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతున్నదని మండిపడ్డారు. వెంటనే అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని, రూ. 500 బోనస్ రైతులు అందజేయాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చౌటుప్పల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

ఆగని ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల పోరాటం

- చౌటుప్పల్‌లో రెండో రోజూ ట్రిపుల్ అవార్డ్ విచారణ బహిష్కరణ
- తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

చౌటుప్పల్, అక్టోబర్ 24 : ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం భూ సేకరణలో భాగంగా చేపట్టిన అవార్డు విచారణను రెండో రోజూ భూ నిర్వాసితులు బహిష్కరించారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేయగా, మండల పరిధిలోని నేలపట్ల, తంగడపల్లి గ్రామాల నిర్వాసితులు నిరసన తెలిపారు. 3జీ నోటిఫికేషనల్ భాగంగా బాధితులు బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, పాన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకునేందుకు ఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాగా, ప్రభుత్వం తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేస్తూ సమావేశాన్ని బహిష్కరించి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు ప్రధాన రహదారులను 40 కిలోమీటర్లు దూరం కేటాయించి, చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల్లో కేవలం 28 కిలోమీటర్ల పరిధిలో తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని స్పష్టం చేస్తూ ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, భూనిర్వాసితులు దబ్బేటి రాములు గౌడ్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, సందగళ్ల మల్లేశం గౌడ్, బోరెం ప్రకాశ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, వల్లూరి బోగయ్య, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బైఠాయింపు
- విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట

భువనగిరి అర్బన్, అక్టోబర్ 24 : ఫీజు రియింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారిపై గురువారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నినాదాలు చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టే క్రమంలో పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ, కార్యదర్శి లావుడియా రాజు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులు రోడ్లపాలయ్యారని, ఇప్పటి వరకు విద్యార్థులకు 8,300 కోట్లు బకాయిలున్నాయని వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. నాలుగు రోజుల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు బంద్ చేసి నిరసన చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడం ఆ శాఖపై వారికున్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నదని, విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారే లేరన్నారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోతే చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుందని, అనేక ప్రైవేటు కళాశాలలు మూతపడే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, జగన్, ఉదయ్, భవాని శంకర్, నరేందర్, మహేశ్, సతీశ్, వెంకటేశ్, చింటు, శివ, అనుస్, కీర్తన, మమత పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

- నవంబర్ 16 నుంచి 20 వరకు అందుబాటులో

బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్‌కుమార్ సెంగర్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 24 : శబరిమలకు వెళ్లే భక్తుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నూతనంగా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటీవ్ పవన్‌కుమార్ సెంగార్ అన్నారు. గురువారం యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును ఏర్పాటుచేయడంతో పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లే యాత్రికుల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదన్నారు. ఇదే తరహాలో తాజాగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి శబరిమలకు నవంబర్ 16 నుంచి 20 వరకు రైలు సౌకర్యం ఉంటుందన్నారు. శబరిమలైలోని అయ్యప్ప ఆలయం, ఎర్నాకులం, చోటానెక్కర్ అమ్మవారి ఆలయాలను కవర్ చేస్తూ, నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు టూర్ కొనసాగుతుందని తెలిపారు. టూ టైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసుల్లో ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకోవచ్చనని, టికెట్ ధర రూ.11,475 ఉంటుందని తెలిపారు. ఈ రైలు తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ప్యాకేజీకి సంబంధించిన మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్‌సైట్, 9281030711, 9281030750 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్, రైల్వే అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

అంబుజా సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతాం

- ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

రామన్నపేట, అక్టోబర్ 24 : రామన్నపేట మండల కేంద్రంలో నిర్మించాల్సి చూస్తున్న అంబుజా సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతామని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. గురువారం ఆర్ఆండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రామన్నపేట పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి అంబుజా సిమెంట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ నిరసన తెలపడం చారిత్రాత్మకమన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరికల్ల గోపాల్, నన్నూరి శంకర్‌రెడ్డి, బొడ్డు శంకరయ్య, బొడ్డు వెంకటయ్య ఉన్నారు.

శిక్షణ పొందిన తాగునీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఆలేరురూరల్, అక్టోబర్ 24 : తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మంచినీటి సహాయకులకు కలెక్టర్ హనుమంతు కె. జెండగే సూచించారు. ఆలేరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వారికి ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేతిపంపులు, గొట్టపు బావులకు అమర్చిన పంపుసెట్లు, ప్యానెల్ బొర్డులకు మరమ్మతులు చేయడం వంటి చిన్న సమస్యలు సహాయకులు పరిష్కరించాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో జడ్పీసీఈఓ శోభారాణి, ఎస్ఈ కృష్ణయ్య, ఈఈఆర్‌డబ్ల్యూఎస్ కరుణాకర్, మండల ప్రత్యేకాధికారి గోపాల్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, మోటకొండూరు ఎంపీఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట పారిశుధ్య విధానం పరిశీలన

- కంపోస్ట్ యార్డులను సందర్శించిన మున్సిపల్ కమిషనర్లు

సూర్యాపేట : జమునా నగర్‌లో వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న ఇతర మున్సిపాలిటీల అధికారులు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : పట్టణంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య విధానాన్ని అధ్యయనం చేసేందుకు నకిరేకల్, చండూరు, చిట్యాల, నందికొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు సూర్యాపేట మున్సిపాలిటీని గురువారం సందర్శించారు. పురపాలక పరిపాలన శాఖ ఆదేశాల మేరకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని బాలెంల, జమునా నగర్ కంపోస్టు యార్డులు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వారు పరిశీలించారు. బాలెంలలో కంపోస్టు యార్డులో నిర్వహిస్తున్న సెమీ మెకనైజ్డ్ ఎస్ బ్ల్యూఎం ప్లాంట్, డీఆర్‌సీసీ, బేలింగ్ మిషన్, కన్వేయర్ బెల్ట్, విండ్రో కంపోస్టు బెడ్స్, వర్మీ కంపోస్టు యూనిట్, విండో కంపోస్ట్ యూనిట్, పాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను సందర్శించి విధానం తెలుసుకున్నారు. అదే విధంగా జమునా నగర్‌లో గల ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్, ఇటుకలు, అక్యూప్రెషర్ మ్యాట్‌లు, పీవీసీ పైపుల తయారీకి ముడి పదార్థంగా ఉపయోగించే విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో తడి, పొడి చెత్త సేకరణ, చెత్త వర్మీ కంపోస్టు, విండో కంపోస్ట్ చేస్తున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ వారికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు యూసుఫ్, దండు శ్రీనివాస్, రామ్ దుర్గారెడ్డి, మున్వర్ అలీ, బాలయ్య, భాస్కర్‌రెడ్డి, వీరేంద్ర, డీఈ సత్యారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.